క్లుప్తంగా

రూ 1.25 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



గుంటూరు రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నల్లపాడులో శ్రీఅంకమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో 31వ వార్షిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామి వద్ద ప్రత్యేక పూజలు అందుకున్న లడ్డూ వేలం పాటను కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలంలో లడ్డూను గ్రామానికి చెందిన కోటు శ్రీనివాసరెడ్డి కుమారుడు గోపిరెడ్డి రూ 1,25,000కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు లడ్డూను అందజేసి సన్మానించారు. అనంతరం స్వామిని ఊరేగింపుతో నిమజ్జనోత్సవం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరవై గుండె బైపాస్ సర్జరీలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సీటీవీస్ వైద్య విభాగంలో 60 గుండె బైపాస్ సర్జరీలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణగోఖలే జీజీహెచ్‌కు వచ్చి గుండె ఆపరేషన్లు చేసిన వైద్య బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె ఆపరేషన్లు చేయాలని, ముఖ్యంగా తాను చదువుకున్న గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్‌లో ఆపరేషన్లు చేసేందుకు ముందుకొచ్చామన్నారు. సహృదయ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని సుమారు 600 పైగా బైపాస్ సర్జరీలు, మూడు గుండె మార్పిడి ఆపరేషన్లు గుంటూరు జీజీహెచ్‌లో విజయవంతంగా చేశామన్నారు. జీజీహెచ్‌లో సీటీవీఎస్ వైద్య విభాగాన్ని పూర్తిగా బలోపేతం చేసి ఇక్కడి వైద్యులు గుండె ఆపరేషన్లు చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు. జీజీహెచ్ వైద్యులు డాక్టర్ పేరం కుప్పుస్వామి ఆధ్వర్యంలో విజయవంతంగా 60 బైపాస్ సర్జరీలు చేసినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో గుండె మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లో జరిగేలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే వెల్లడించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో కంటే ఏపీలోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె ఆపరేషన్లు ఎక్కువగా చేయటం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ కోనేరు సుధాకర్, డాక్టర్ పేరం కుప్పుస్వామి, డాక్టర్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



లక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని వీఆర్ విత్ యూ ఫౌండేషన్ చైర్మన్ ఎస్.అయ్యప్ప అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో ఆదివారం యువజన సర్వీసుల శాఖ స్టెప్, స్వశక్తి గుంటూరు ఆధ్వర్యంలో వీఆర్ విత్ యూ ఫౌండేషన్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సంస్థ చైర్మన్ అయ్యప్ప ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రమాదకర పరిస్థితిలో, అత్యవసరంగా వినియోగించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని అన్నారు. రక్తదానం ఎంత మేలు చేస్తుందంటే ఎదుటి వ్యక్తి ప్రాణాలను రక్షించి వారికి పునర్జన్మను ఇస్తుందని తెలిపారు. రక్తదానం చేసేందుకు ప్రధానంగా యువత స్వచ్ఛందంగా ముందుకు రావల్సిందిగా పిలుపునిచ్చారు. అనంతరం రక్తదానాన్ని 80 మంది యువతీ, యువకులు చేశారు. వారికి ప్రమాద బీమా(లక్ష రూపాయల) పత్రాన్ని అందజేశారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం పదిలం

లక్ష్మీపురం: ఆయుర్వేదంతో ఆరోగ్యం పదిలం చేసుకోవాలని సీనియర్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నాగేంద్ర అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయుర్వేదంలో పంచకర్మ బాగా ప్రసిద్ధి చెందిందని వివరించారు. అనంతరం నాగేంద్రను ఘనంగా సత్కరించారు.



జనావాసాల మధ్య మురుగు నీరు



నివాసాల మధ్య అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

నిత్యం నరకం.. బతుకు దుర్భరం

- సమస్యల చెరలో ఎస్టీకాలనీ
- పారిశుధ్యాన్ని పట్టించుకునే వారు కరువు
- కాలువలు తీసేవారు కానరారు
- వెలగని వీధి దీపాలతో అంధకారంలో రాత్రి జీవనం
- లబోదిబోమంటున్న ఎస్టీ కాలనీ వాసులు

ప్రత్తిపాడు: స్థానిక ఎస్టీ కాలనీ వాసులు దుర్భర జీవితాలను గడుపుతున్నారు. పాలకులు.. అధికారులు గ్రామాన్ని ఒకలా.. శివారునున్న ఈ కాలనీని మరోలా చూస్తుండటంతో నెలల తరబడి నివాసితులంతా సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు. సైడు కాలువల్లో మురుగు నీరు ముందుకు పారక దోమలకు అవాస ప్రాంతాలుగా మారుతున్నాయి. కాలువల్లో రోజుల తరబడి మురుగు నీరు నిలిచి పచ్చని రంగులోకి మారింది. ఖాళీ నివేశన స్థలాల్లో పెద్దఎత్తున మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కాలనీలోని మురుగు నీరు ముందుకు పారడం లేదు. భారీ వానలు కురిసిన సమయంలో నీరు బయటకు వెళ్లే మార్గం లేక నివాసాలను ముంచెత్తుతోంది. రాత్రిపూట అయితే నివాసితుల బాధలు వర్ణణాతీతం. కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. ఏ మూల నుంచి ఏ విష పురుగు వస్తుందో అర్థంకాక ప్రతిరోజూ బిక్కుబిక్కుమంటూ నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. కాలనీ సమస్యలు పరిష్కరించండి సారూ అంటూ నివాసితులు అనేక సార్లు పాలకులకు, పంచాయతీ అధికారులకు నెత్తీ నోరు బాదుకుని చెబుతున్నా మొర ఆలకించేవారే కరువయ్యారు. తమను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు తప్పా మనుష్యులుగా చూడటం లేదని వారంతా వాపోతున్నారు. పారిశుధ్యం పూర్తిగా క్షీణించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.



రోజుల తరబడి డ్రెయిన్‌లో పారని మురుగు

పట్టించుకునేవారే లేరు



మమ్మల్ని, మా కాలనీని పట్టించుకునే వారే లేరు. ఎన్నికలప్పుడు వస్తారు మా ఓట్లు కోసం. ఆ తర్వాత బాధలు పట్టించుకోరు. ఆలకరించరు. మురుగు కాలువలు తీయించండి సారూ అంటూ ఎన్నిసార్లు ఎంత మందిని వేడుకున్నా ఒక్కరూ మమ్మల్ని, మా బాధల్ని ఆలకించిన వారు లేరు. మురుగు ముందుకు పారక దోమలు పెరిగి జ్వరాల బారిన పడుతున్నాం.

– ఆవుల చెంచయ్య

రాత్రి పూట నరకం



కాలనీలో వీధి దీపాలు లేవు. ఉత్త స్తంభాలే ఉన్నాయి. చీకట్లో ముళ్ల పొదలు, చెట్ల మాటు నుంచి పాములు బుసలు కొడుతూ వస్తున్నాయి. దీపాలెయ్యండని ఇక్కడకొచ్చిన వాళ్లందరికీ చేతులెత్తి మొక్కుతున్నాం. కానీ ఏ ఒక్కరూ మా బాధలు పట్టించుకోవడం లేదు. అధికారులు చొరవ చూపి కాలనీకి లైట్లు వేయించాలి.

–నల్లబోతుల రెడ్డమ్మ

'చెత్త'పాట్ల నుంచి మోక్షం ఎప్పుడో !

గుంటూరు రూరల్: ఒక పక్క పదివేల మంది విద్యార్థులు చదివే పాఠశాల, మరోపక్క మూడు వేల మంది చదివే కళాశాల, ఎదురుగా ప్రతిష్టాత్మకమైన శ్రీ పుష్పాద్రి లక్ష్మీనరసింహ ఆలయం, మరోపక్క పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థుల హాస్టల్స్.. వీటన్నిటి మధ్యలో పెద్ద డంపింగ్ యార్డ్‌ను తలపించే విధంగా చెత్తకుప్పతో నివాసితులు అవస్థలు పడుతున్నారు. వెంగళాయపాలెం, చల్లావారిపాలెం, నల్లపాడు గ్రామాల్ని కలిపే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గాలులకు వ్యర్థాలు ఎగురు తూ సమీపంలోని ఇళ్లలోకి వెళుతున్నాయి. వెంగళాయపాలెం,చల్లావారిపాలెం పంచాయతీ పారిశుధ్య సిబ్బంది గానీ నల్లపాడు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గానీ పట్టించుకోకపోవడంతో నెల రోజులుగా చెత్త అక్కడే ఉంటోంది. ఈగలు, దోమలు ముసురు కుంటున్నాయి. విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.



వెంగళాయపాలెం ప్రధాన రహదారి వెంట చెత్త

యువతకు మోక్షగుండం స్ఫూర్తి



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ తదితరులు

కొరిటెపాడు: భారతరత్న, డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్లు అందరికీ స్ఫూర్తి ప్రదాత అని, ఆయన అడుగుజాడలే నేటి తరం ఇంజినీర్లకు మార్గదర్శకమని బజరంగ్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్, ఇంజినీర్ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఇంజినీర్స్ డే వేడుకలలో సందర్భంగా ఆదివారం గుంటూరు పట్టాభిపురంలోని బజరంగ్ అర్బన్ కార్యాలయంలో భారతరత్న, డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వర్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మానవ జీవితంలో యంత్ర పరికరాల వినియోగం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎన్నో పనులను అత్యంత సులువుగా, బహుళ ప్రయోజనకరంగా చేసుకోవడానికి ఇంజినీరింగ్ అద్భుతాలే కారణమన్నారు. భారతావని గర్వించదగ్గ స్థాయిలో కృషి చేసిన ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్మారకంగా ఇంజినీర్స్ డే జరుపుకోవడం ముదావహమన్నారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

నెహ్రూనగర్: ప్రతి సోమవారం ప్రజల నుంచి స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను మిలాద్ ఉన్ నబీ పండుగ కారణంగా రద్దు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

విజ్ఞాన్ నిరులలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న మురళీ మనోహర్

గుంటూరు రూరల్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో లక్ష్య సాధన దిశగా కృషిచేసి ఉన్నత శిఖరాలను చేరాలని బీఎస్ఎన్ఎల్ కోర్ నెట్‌వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్ పసుపులేటి మురళీ మనోహర్ తెలిపారు. పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఇంజనీర్స్ డే, బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు స్వాగతోత్సవం నిర్వహించారు. కుమారి యశస్వి శుభగాత్రి స్వాగత నత్యం అలరించింది. అనంతరం మురళీ మనోహర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ప్రస్తుత సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వాలని తెలిపారు. విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ భారతదేశం తొలి తరం ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఉద్యోగాలు సాధించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన మిస్ ఫ్రెషర్– 2024 పోటీలో మొదటి సంవత్సరం విద్యార్థిని శ్రీవల్లి విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక తెలిపారు. అనంతరం కళాశాలలో వివిధ అంశాలలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు పురస్కారాలు, బీటెక్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



ఫ్రెషర్స్‌డేలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

- విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- విజ్ఞాన్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

చేబ్రోలు: విద్యార్థులు పెద్ద పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని అందుకునేందుకు కృషి చేయాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునే దిశగా సాగాలని, వైఫల్యాలను సైతం విజయానికి సోపానంగా మార్చుకోవాలని సూచించారు. సాహసాలు చేయడానికి ఎప్పుడూ వెనకాడకూడదన్నారు. విద్యార్థులు వారి ఆలోచనలు, జ్ఞానాన్ని సహచర విద్యార్థులతో పంచుకుంటే అంతకుమించిన గొప్ప అధ్యయనం మరోటి ఉండదన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఫ్రెషర్స్ డే వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో నిడుబ్రోలు రైతుబజార్

- ఏళ్ల తరబడి తెరచుకోని దుకాణాలు
- అద్దెల భారంతో రైతులు దూరం
- సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం

సమస్యల 'బజార్'



నిడుబ్రోలు రైతు బజార్

పొన్నూరు: పట్టణ పరిధిలోని నిడుబ్రోలు రైతు బజార్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. గతంలో వినియోగదారుల రద్దీతో కళకళలాడిన రైతుబజార్ గతంలో పనిచేసిన కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం వెలవెలబోతోంది. పెరిగిన అద్దెలు, పలు సమస్యలతో రైతులు, వ్యాపారులు వ్యాపారాలు నిర్వహించలేక దూరమవుతున్నారు. కూరగాయల వ్యాపార నిర్వహణ లేక పదుల సంఖ్యలో దుకాణాలు మూతబడ్డాయి. ఏళ్ల తరబడి మూతబడిన దుకాణాలు తెరిచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, రైతుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో వినియోగదారులు, కూరగాయలు పండించే రైతులకు ప్రయోజనం చేకూర్చడంలో ప్రభుత్వం లక్ష్యం నీరుగారింది.

నాడు కళకళ.. నేడు వెలవెల

అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిడుబ్రోలు రైతు బజార్ ప్రస్తుతం ప్రజాదరణ కోల్పోయి వెలవెలబోతుంది. గతంలో వినియోగదారులతో రద్దీగా ఉండే రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే రైతులు లేక దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గతంలో పనిచేసిన కొందరు ఎస్టేట్ అధికారులు రైతులను విస్మరించి అద్దెలు చెల్లించే వ్యాపారులను ప్రోత్సహించడంతో రైతుబజార్ నేడు కమర్షియల్ మార్కెట్‌గా మారింది. విపరీతంగా అద్దెలు పెరగడంతో రైతులు, డ్వాక్రా సంఘాలు కూడా దుకాణాలు తీసుకొని వ్యాపారాలు చేసేందుకు ముందుకు రావడంలేదు. రైతులు పండించిన కూరగాయలను విక్రయించి జీవనోపాధి పొందడం, డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించే విధంగా రైతు బజారు ఏర్పాటైంది. 22 దుకాణాలను రైతులకు ఉచితంగా కేటాయించింది. రైతుల కోసం ఆర్వో ప్లాంటు, ఇతర వసతులు కల్పించారు. ఏర్పాటైన కొన్నేళ్ల పాటు వినియోగదారులతో కళకళలాడింది. మండలంలో కూరగాయల సాగు అధికంగా ఉండటంతో రైతు బజార్‌లో తక్కువ ధరకే కూరగాయలు ప్రజలకు అందాయి. లాభాలను ఆశించకుండా రైతులు విక్రయించి లబ్ధి పొందారు.



ఖాళీగా ఉన్న దుకాణాలు



వెలగని ఎల్ఈడీ డిస్‌ప్లే

22 దుకాణాల్లో నేడు 7 మాత్రమే..

అయితే గతంలో పనిచేసిన కొందరు ఈఓల రాకతో రైతు బజార్ దశ మారింది. వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించి రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ప్రైవేటు వ్యాపారులకు దుకాణాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. వ్యాపారులు కొందరు అధిక ధరలకు విక్రయించడం, వినియోగదారులతో వాదనలు పెరగడంతో కాలక్రమేణా కొనుగోలుదారులు దూరమయ్యారు. దీంతో రైతు బజార్ ప్రజాదరణ కోల్పోయింది. వ్యాపారం చేసేందుకు రైతులు, డ్వాక్రా సంఘాలు ఎవరూ ముందుకు రావడం లేదు. దుకాణ అద్దె ఒకటి రూ. 5,300 నుంచి 5,500 వరకు ఉండటంతో వాటిని చెల్లించి వ్యాపారం నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ఉన్న 22 దుకాణాలలో గత కొంతకాలంగా ఏడు దుకాణాలలో మాత్రమే కూరగాయల విక్రయాలు కొనసాగుతుండటం విశేషం. ఉన్నతాధికారులు స్పందించి రైతు బజార్‌లో దుకాణ అద్దెలు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. 13 దుకాణాల వరకు ఉచితంగా కేటాయించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. వాటిని రైతులకు కేటాయించి పూర్వవైభవం తీసుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దుకాణాల భర్తీకి చర్యలు



రైతు బజార్‌లోని అన్ని దుకాణాలు భర్తీ చేసే విధంగా చర్యలు చేపడతాం. ప్రస్తుతం ఏడు దుకాణాలలో వ్యాపారాలు జరుగు తున్నాయి. మిగిలిన 15 దుకా ణాలు త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తాం. అద్దెలు కూడా తగ్గించేలా చర్యలు చేపడుతున్నాం. రైతు బజార్‌లో అన్ని సమస్యలు పరిష్కరించి పూర్వవైభవం తీసుకువస్తాం.

– జి.రమేష్, ఎస్టేట్ అధికారి, పొన్నూరు

సేంద్రియ సాగుదే భవిష్యత్తు

నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ శరత్



వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని వివరిస్తున్న రైతునేస్తం ఫౌండేషన్ సిబ్బంది

గుంటూరు రూరల్: సేంద్రియ సాగుదే భవిష్యత్తు అని, రైతులు కూడా మంచి ఆదాయం పొందవచ్చని నాబార్డ్ గుంటూరు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ శరత్ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్‌లో ఆదివారం సేంద్రియ సాగు, విలువల జోడింపు, కషాయాల తయారీపై రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయం అనేక అనర్థాలకు దారి తీస్తుందని, ప్రత్యామ్నాయంగా రైతులు సేంద్రియ బాట పడుతున్నారన్నారు. నాబార్డు కూడా సేంద్రియ సాగు అభివృద్ధిలో తన పాత్రను పోషిస్తోందని తెలిపారు. చదువుకున్న యువతీ, యువకులు, ఔత్సాహిక రైతులు సేంద్రియ సాగును చేపట్టాలని తెలిపారు. సేంద్రియ ఉత్పత్తులకు విలువ జోడించి మంచి ఆదాయ వనరుగా మార్చుకోవచ్చని సూచించారు. చిన్న స్థలంలో వివిధ పంటలతో సమయం, డబ్బు ఆదా అవుతుందని, దీనికి బహుళ అంచెల సాగు సరైన పరిష్కారమని చెప్పారు. బహుళ అంచెల సాగు విధానాన్ని రైతు ఏడుకొండలు ప్రత్యక్షంగా వివరించారు. మిరప నారును బీజామృతంలో ముంచి నాటుకొని అవసరాన్ని బట్టి నీమాస్త్రం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపర్ణి కషాయం లాంటి వాటిని ఉపయోగించి చీడపీడల నివారణతో పాటు ఆరోగ్యకర దిగుబడులు సాధించవచ్చని సేంద్రియ రైతు శివనాగమల్లేశ్వరరావు వివరించారు. జామను పూర్తిగా సేంద్రియ పద్ధతులతో సాగు చేస్తే ఎలాంటి సమస్య లేకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని సేంద్రియ రైతు శబరీనాథ్ తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపునకు సంబంధించిన వివిధ యంత్ర పరికరాల వివరాలు, ధర, పనిచేసే విధానాలు, దొరికే ప్రదేశాలను రైతునేస్తం ఫౌండేషన్ " చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రైతులు, రైతునేస్తం సిబ్బంది పాల్గొన్నారు.

వెళ్లిరావయ్యా బొజ్జ గణపయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో ఆదివారం వినాయక నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి వేడుకలు నిర్వహించారు. తొమ్మిదో రోజున ఆదివారం వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు మేళతాళాలతో ఊరేగింపుగా నిమజ్జన కేంద్రాలకు తరలివెళ్లాయి. చేబ్రోలులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా కొమ్మమూరు ఛానల్ వద్ద నిమజ్జన కేంద్రానికి తరలించారు. చేబ్రోలులోని కొమ్మమూరు ఛానల్ నిమజ్జన కేంద్రం, సంగం జాగర్లమూడి నిమజ్జన కేంద్రాల వద్ద వందలాది విగ్రహాలకు నిమజ్జనాలను నిర్వహించారు.



చేబ్రోలులో భారీ వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు